క్లుప్తంగా

ఘనంగా కొత్తల పండుగ



వాజేడు: మండల వ్యాప్తంగా కొత్తల పండుగను గిరిజనులు గురువారం ఘనంగా నిర్వహించుకున్నారు. ప్రతీ సంవత్సరం కొత్తల పండుగ (పెద్దల పండుగ)ను గిరిజన సంప్రదాయ పద్ధతిలో చేపడుతారు. కొత్తల పండుగ సందర్భంగా కుటుంబంలోని చనిపోయిన వారికి నైవేద్యం పెట్టి భూ దేవికి విప్ప సారాను ఆరబోశారు. ఇంటిల్లి పాది నైవేద్యం పెట్టిన ప్రసాదాన్ని ఆరగించి అందరు కలిసి భోజనాలను చేశారు.

అక్రమ అరెస్టులు హేయమైన చర్య

ములుగు: రైతులు ఛలో ప్రజాభవన్‌కు వెళ్తున్న నేపథ్యంలో పోలసులు అక్రమ అరెస్టులు చేయడం హేయమైన చర్య అని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి గురువారం ఒక ప్రకటనలో అసహనాన్ని వ్యక్తం చేశారు. ఉదయం నుంచి అన్ని మండలాల్లో రైతుల ఇంటికి వెళ్లి అదుపులోకి తీసుకోని పోలీస్ స్టేషన్‌కు తరలించడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. అధికారంలోకి రాగానే ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చి మోసం చేశారని, రైతులకు కనీసం 40 శాతం రుణమాఫీ కూడా కాలేదని పేర్కొన్నారు. రైతుల పక్షాన పోరాడడానికి బీఆర్ఎస్ పార్టీ సిద్ధంగా ఉందని అన్నారు.

దాడులు బాధాకరం



ములుగు: బీజేపీ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తరువాత అంటరానితనం పెరుగుతూ వస్తుందని, అక్కడక్కడా దళితులపై దాడులు జరగడం బాధాకరం అని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అరూరి కుమార్ ఆరోపించారు. గురువారం జిల్లాకేంద్రంలో జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితులకు రక్షణ కల్పించాలన్నారు. అనంతరం మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తప్పట్ల రాజేందర్, ప్రధానకార్యదర్శిగా దేవేందర్, ఉపాధ్యక్షుడిగా కొత్తూరు సాంబయ్య, సహాయ కార్యదర్శిగా కలవల తిరుపతి, సభ్యులు ఓరుగంటి కుమారస్వామి, రవి, రమేశ్, శ్రీను, వాసును ఎన్నుకున్నటు కుమార్ తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి



వెంకటాపురం(కె): గ్రామాల్లో ఉన్న సమస్యలను అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల ఉపాధ్యక్షుడు తాటి రాంబాబు తెలిపారు. ఆదివాసీ సంక్షేమ పరిషత్ ముఖ్య కార్యకర్తల సమావేశం ఆలుబాక గ్రామంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ.. మండలంలో కురిసిన భారీ వర్షాలకు గ్రామాల్లోని రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మురిగు కాల్వలు శుభ్రం చేయక పోవటంతో రోడ్లపైకి మురుగు నీరు వస్తుందని అన్నారు. గ్రామాల్లో పారిశుధ్య పనులను చేయక పోవటం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి గ్రామాల్లో నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. నాయకులు సూరిబాబు, ప్రశాంత్, రాజు, మహేష్ ఉన్నారు.

విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన



గోవిందరావుపేట: డెటాల్ బనేగా స్వస్థ్ ఇండియా ప్రోగ్రాంలో భాగంగా గ్రామాలయ, కార్పెడ్ సంస్థల ఆధ్వర్యంలో గోవిందరావుపేట ప్రాథమిక, సెకండరీ పాఠశాలలోని విద్యార్థులకు పరిశుభ్రత, ఆరోగ్యంపై కార్పెడ్ సంస్థ ప్రతినిధి ఎండీ షఫీ అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ప్రస్తుత సీజన్లో వచ్చే వ్యాధులపై ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. తప్పకుండా చేతులను సబ్బుతో మాత్రమే 20 నుంచి 40 సెకండ్ల వరకు శుభ్రంగా కడగాలని తెలియజేశారు. విద్యార్థులందరికీ ఉచితంగా డెటాల్ సబ్బులను ఎంఈఓ దివాకర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. అలాగే విద్యార్థులచే స్వచ్ఛ విద్యాలయ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీఎస్ హెచ్ఎం రఘురాం, ఉపాధ్యాయులు, కార్పెడ్ సంస్థ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటరు లిస్టు సవరణకు అవకాశం



చిట్యాల: మాట్లాడుతున్న ఎంపీడీఓ రామకృష్ణ



పలిమెల: మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాస్



కాళేశ్వరం: మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటేశ్వర్లు

చిట్యాల: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఓటరు జాబితాలను ఏర్పాటు చేయడం జరిగిందని అందులో ఏమైన వార్డుల వారిగా మార్పులు ఉంటే సవరణకు అవకాశం ఉందని ఎంపీడీఓ రామకృష్ణ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన మాట్లాడతూ.. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో వార్డుల వారి ఓటర్ జబితాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అందులో ఏమైన మార్పులు చేర్పులు ఉంటే గ్రామ పంచాయతీ కార్యదర్శి, లేదా ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 21 వరకు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

ఓటరు లిస్టులో అభ్యంతరాలు తెలపొచ్చు

పలిమెల: రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఇటీవల విడుదల చేసిన గ్రామ పంచాయతీలు, వార్డుల వారీగా ఓటర్ల జాబితా పై రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఏమైనా అభ్యంతరాలుంటే ఈనెల 21లోగా లిఖితపూర్వకంగా తెలపాలని ఎంపీడీఓ శ్రీనివాస్ కోరారు. గురువారం ఈ మేరకు మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మండల రాజకీయ పార్టీ ప్రతినిధులతో ఆయన సమావేశం



కాటారం: మాట్లాడుతున్న ఎంపీఓ వీరస్వామి

నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల నోటిఫికేషన్, ప్రచురణ, అభ్యంతరాల స్వీకరణ విషయాలపై వివరించారు. అభ్యంతరాల స్వీకరణ అనంతరం ఈనెల 28న తుది జాబితా ప్రచురణ ఉంటుందన్నారు. సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు రాజేందర్, మేకల రాజమ్మ, జనగామ రామ్మూర్తి, తదితరులు హాజరైయ్యారు.

రేగొండ: గ్రామ పంచాయతీ ఓటరు జాబితాలో అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రాంప్రసాద్‌రావు తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో రాజకీయ పార్టీ నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

కాటారం: గ్రామ పంచాయతీలో ప్రదర్శించిన ఓటర్ జాబితాలపై అభ్యంతరాల కోసం గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పలు రాజకీయ పార్టీల నాయకులతో ఎంపీఓ సమావేశం నిర్వహించారు. గ్రామపంచాయతీల వారిగా ఓటర్ జాబితాలపై ఏవైన అభ్యంతరాలు ఉంటే తెలుపాలని కోరారు. పలు పార్టీల నాయకుల నుంచి సూచనలు, సలహాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు బొమ్మ మల్లారెడ్డి, ఉమాశంకర్, బొడ్డు రాజబాబు, పంచాయతీ కార్యదర్శులు షగీర్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరం: గ్రామ పంచాయతీలో సాధారణ ఎన్నికలు నిర్వహించడానికి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల స్థాయిలో అన్ని రాజకీయ పార్టీల అధ్యక్షులతో ఎంపీడీఓ కే.వెంకటేశ్వర్లు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటర్ లిస్టులో ఏమైనా అభ్యంతరాలు, సవరణలు ఉంటే సంబంధిత గ్రామపంచాయతీ కార్యదర్శికి అందజేయాలని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అక్బర్‌ఖాన్, బీజేపీ మండల అధ్యక్షులు ఆకుల శ్రీధర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, మాజీ ఎంపీపీ రాణిబాయి, డీఎల్పీఓ వీరభద్రయ్య, తహసీల్దార్ ప్రహ్లాద్ రాథోడ్, సూపరింటెండెంట్ శ్రీధర్ బాబు పాల్గొన్నారు.

జాతీయ క్రీడాకారులకు ఘన సన్మానం



క్రీడాకారులను సన్మానిస్తున్న శ్రీనివాస్

టేకుమట్ల: రాష్ట్ర స్థాయి త్రోబాల్‌లో అత్యంత క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి జార్ఖండ్‌లోని రాంచీలో నిర్వహించే జాతీయ స్థాయికి జయశంకర్ భూపాలపల్లి జిల్లా నుంచి ఇద్దరు క్రీడాకారులు ఎంపికయ్యారు. కాగా వారిని గురువారం హనుమకొండ జిల్లా కేంద్రంలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో మాతృశ్రీ ఫౌండేషన్ చైర్మన్ దొంతుల శ్రీనివాస్ శాలువాలతో ఘనంగా సన్మానించి, ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టేకుమట్ల మండలంలోని అంకుషాపూర్ గ్రామానికి చెందిన సాద రఘు, పలిమెల మండలంలోని ముకునూరు గ్రామానికి చెందిన మట్టి సాగర్‌లు ఎంపిక కావడం గర్వకారణమన్నారు. రాష్ట్రస్థాయిలో రాణించినట్లుగానే జాతీయ స్థాయి క్రీడల్లో ప్రతిభ కనబర్చి జిల్లాకు పేరు తీసుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నడికూడ మాజీ జెడ్పీటీసీ కోడెపాక కరుణాకర్, మాతృశ్రీ ఫౌండేషన్ సభ్యులు ఇనుగాల రవీందర్, కో ఆర్డినేటర్ దాసారపు వర్ధన్, తదితరులు ఉన్నారు.

ప్లాస్టిక్ వినియోగిస్తే చర్యలు



డిస్పోసల్ గ్లాస్‌లు, ప్లేట్లు రవాణా చేస్తున్న వాహనాన్ని పరిశీలిస్తున్న ఎంపీఓ వీరస్వామి

కాటారం: ప్లాస్టిక్ వినియోగిస్తే చర్యలు తప్పవని ఎంపీఓ వీరస్వామి హెచ్చరించారు. మండలంలోని గ్రామపంచాయతీల్లోని కిరాణాలు, జనరల్‌స్టోర్స్ యజమానులు, చికెన్, మటన్ షాపు దుకాణదారులకు ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించారు. దుకాణదారులు సింగిల్ యూస్ ప్లాస్టిక్ కవర్లు, పాలథీన్ కవర్లు ఉపయోగించవద్దని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ప్లాస్టిక్, పాలథీన్ కవర్లు వినియోగిస్తే యజమానిపై రూ.2వేలు జరిమానా విధించడం జరుగుతుందని హెచ్చరించారు. మళ్లీ అదేవిధంగా వినియోగిస్తే ట్రేడ్ లైసెన్స్‌ను రద్దు చేసి షాప్ సీజ్ చేస్తామని తెలిపారు.

సింగిల్ యూస్ ప్లాస్టిక్ పట్టివేత..

హనుమకొండ నుంచి కాటారం వైపుగా సింగిల్ యూస్ ప్లాస్టిక్ అయిన డిస్పోజల్ గ్లాస్, ప్లాస్టిక్ ప్లేట్స్ తరలిస్తున్న వాహనాన్ని మండల కేంద్రంలో ఎంపీఓ వీరస్వామి పట్టుకున్నారు. వాహనదారుడికి నోటీస్ ఇచ్చి మళ్లీ పునరావృతం అయితే రూ.5వేలు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. అమ్మకాలు చేపట్టకుండా వాహనాన్ని తిరిగి హనుమకొండకు పంపించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి షగీర్‌ఖాన్, సిబ్బంది పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

భూపాలపల్లిరూరల్: నియోజకవర్గాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేయడమే లక్ష్యమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు కోరారు. నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి పనులు, ప్రగతి కార్యక్రమాలపై ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జెడ్పీ సీఈఓ, జిల్లా ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ విజయలక్ష్మితో కలిసి గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతీ రోజు గ్రామాల్లో పర్యటిస్తున్న సందర్భంలో ప్రజల నుంచి గ్రామాల్లో మౌలిక వసతులకు సంబంధించి చాలా వినతులు వస్తున్నాయని తెలిపారు. తనపై నమ్మకంతో గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు రానున్న ఐదేళ్ల కాలం పాటు స్థానికంగానే అందుబాటులో ఉంటూ సేవలందిస్తానని వెల్లడించారు. అధికారుల పూర్తి సహకారం ఉన్నప్పుడే ప్రజల సమస్యలను సకాలంలో పరిష్కరించేందుకు వీలవుతుందని, ఈ మేరకు అన్ని శాఖల అధికారులు తోడ్పాటును అందించాలని సూచించారు. క్రమం తప్పకుండా సమీక్షలు జరుపుతూ నియోజకవర్గ అభివృద్ధికి బాటలు వేస్తానన్నారు. పెండింగ్‌లో ఉన్న రోడ్లు, మంచి నీటి పైపు లైన్లు, సైడ్ డ్రెయినేజీ తదితర పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ శ్యామ్‌సుందర్

మల్హర్: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ శ్యామ్‌సుందర్ తెలిపారు. మండలంలోని తాడిచర్ల గ్రామంలో గురువారం స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా గురువారం పంచాయతీ, వైద్య సిబ్బంది, గ్రామస్తులతో కలిసి ఎంపీడీఓ గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాత గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు అవగాహన సమావేశంలో మాట్లాడారు. తడి చెత్త, పొడి చెత్తను వేరు వేరుగా ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రాజు, పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



ఆస్పత్రిని పరిశీలిస్తున్న అధికారులు

కాటారం: ప్రైవేట్ ఆస్పత్రుల్లో నిబంధనలు అతిక్రమించి వైద్యం చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ కొమురయ్య హెచ్చరించారు. మండల కేంద్రంలోని పలు ప్రైవేట్ ఆస్పత్రులను ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శ్రీదేవితో కలిసి అయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రుల అనుమతి పత్రాలు, వైద్యులు, ల్యాబ్ టెక్నిషియన్ల అర్హత పత్రాలు, సౌకర్యాలు, రోగులకు అందుతున్న వైద్య సేవలు, వైద్య పరీక్షల ఫీజుల వివరాలను పరిశీలించారు. పలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో అర్హత లేని వైద్యులతో వైద్యం అందించడంతో పాటు నాణ్యత లేని వైద్యం అందిస్తున్నట్లు గుర్తించినట్లు కొమురయ్య తెలిపారు. ల్యాబ్ టెస్టులు అనర్హులతో చేయిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. పలు ఆస్పతులకు నోటీసులు జారీ చేయనున్నట్లు తెలిపారు. అధికారుల వెంట మండల వైద్యాధికారిణి డాక్టర్ మౌనిక ఉన్నారు.

‘దళిత బంధు’ విడుదలపై కృతజ్ఞతలు

మల్హర్: దళిత బంధు రెండవ విడత నిధుల మంజూరి పత్రాలను, చెక్కులను ఖమ్మం జిల్లాలోని మధిర నియోజకవర్గం చింతకాని, నాగులవంచ మండల దళితులకు అందజేసిన ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్కుకు దళిత బంధు సాధన సమితి జిల్లా అధ్యక్షుడు సంపత్ మహారాజ్ గురువారం కతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సంపత్ మాట్లాడుతూ.. మంథని నియోజకవర్గం నుంచి మంత్రిగా రాష్ట్ర ప్రభుత్వంలో కీలకభూమిక పోషిస్తున్న దుద్దిళ్ల శ్రీధర్‌బాబు దళితబంధు లబ్ధిదారుల పక్షాన ప్రత్యేక చొరవ చూపించి, నిధులు మంజూరు చేయించాలని కోరారు. దళతబంధు పథకం ద్వార లబ్దిదారులుగా ఎంపిక అయిన తర్వాత ఎన్నికల కోడ్ రావడంతో దళితబంధు అమలుకు అంతరాయం కలిగిందన్నారు. మంథని నియోజకవర్గంతో పాటు మిగతా నియోజకవర్గాలలో కలెక్టర్ల ఖాతాలలో ఉన్న నిధులను విడుదల చేసి దళితబంధు లబ్ధిదారుల ఖాతాలోకి జమ చేసి గ్రౌండింగ్ చేయించేలా మంత్రి చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ



మాట్లాడుతున్న సీఐ మల్లేష్

మొగుళ్లపల్లి: సీసీ కెమెరాలతో నేరాలను నియంత్రించవచ్చని చిట్యాల సీఐ మల్లేశ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో రైతులు, కిరణాషాప్, ఫర్టిలైజర్ షాప్ యాజమానులు, ప్రజాప్రతినిధులు, కుల సంఘాల పెద్దలు, ట్రాక్టర్ యూనియన్ సభ్యులు, ఆటో యూనియన్ సభ్యులు, ఇతర వ్యాపారస్తులతో సీసీ కెమెరాల గురించి ఎస్సై అశోక్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లేశ్ మాట్లాడుతూ.. సీసీ కెమెరాలు ఉపయోగం వాటి వల్ల జరిగే లాభాల, నేర నియంత్రణలో వాటి పాత్ర గురించి అవగాహన కల్పించారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



శనిగకుంటలో గర్భిణులకు సీమంతం చేస్తున్న సీడీపీఓ ప్రమలత



వ్యక్తిగత పరిశుభ్రతపై విద్యార్థినులతో ప్రమాణం చేయిస్తున్న సీడీపీఓ

మంగపేట: పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని ఏటూరునాగారం సీడీపీఓ ప్రేమలత అన్నారు. మండలంలోని నర్సింహాసాగర్ పంచాయతీ పరిధిలోని శనిగకుంటలో పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా సూపర్‌వైజర్ తెల్లం ఐసీడీఎస్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక సీమంతాల కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన సీడీపీఓ మాట్లాడుతూ.. గర్భిణులు పోషకాహారం తీసుకోవడం వలన తల్లీ బిడ్డ ఆరోగ్యంగా ఉంటారన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందజేస్తున్న గుడ్లు, పాలు చిరుధాన్యాలు, బాలామృతం తదితర పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవడం వలన కలిగే లాభాలను క్షుణ్ణంగా వివరించారు.

హ్యాండ్‌వాష్‌పై అవగాహన

మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లోని విద్యార్థినులకు హ్యాండ్‌వాష్ కార్యక్రమంపై ఏటూరునాగారం సీడీపీఓ ప్రేమలత ఆధ్వర్యంలో గురువారం అవగాహన కల్పించారు. ఆహారం తీసుకునే ముందు సబ్బు నీటితో మోచేతి వరకు శుభ్రం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ చంద్రకళ, కమల, విజయకుమారి, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) పాఠశాల ప్రిన్సిపాల్ పాయం భాగ్యలక్ష్మి, శృతి, సరితతో పాటు తదితరులు పాల్గొన్నారు.

నేడు క్రీడా పోటీలు

మల్హర్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మండలంలోని తాడిచర్ల జిల్లా పరిషత్ పాఠశాల మైదానంలో నేడు (శుక్రవారం) క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ దేవా నాయక్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ అండర్ 14, అండర్ 17 విభాగల్లో క్రీడా పోటీల నిర్వహణ, మండల స్థాయి జట్ల ఎంపిక ఉంటుందన్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల బాల బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ క్రీడలను మండల కో-ఆర్డినేటర్ సరస్వతి పీడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. మండలంలోని పీఈటీలు, పీడీలు, క్రీడాభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



సభ్యత్వం నమోదు చేస్తున్న శేఖర్

వెంకటాపురం(కె): బీజేపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆ పార్టీ మండల కన్వీనర్ రామెళ్ల శేఖర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రవేశ పెట్టిన ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయానికి కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా పనిచేయాలని కోరారు.

బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్



వెంకటాపురం(ఎం): పోలీసుల అదుపులో బీఆర్ఎస్ నాయకులు



గోవిందరావుపేటలో..

వెంకటాపురం(ఎం): సచివాలయ ముట్టడికి వెళ్లకుండా మండల బీఆర్ఎస్ నాయకులను పోలీసులు గురువారం ఉదయం ముందస్తుగా అదుపులోకి తీసుకోని సాయంత్రం సొంతపూచీకత్తుపై వదిలిపెట్టారు. రైతులకు రుణమాఫీ చేయాలని సచివాలయ ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు గ్రామాల్లోని బీఆర్ఎస్ నాయకులను అక్రమంగా అరెస్ట్ చేయడం సరికాదని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు లింగాల రమణారెడ్డి తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు పోశాల వీరమల్లు, ఎండి.అల్లిమియా, చంటి భద్రయ్య, అబ్బు గోపాల్‌రెడ్డి, దగ్గు ప్రభాకర్‌రావు, కాసర్ల కుమారస్వామి, మంద రవి, నర్రా భద్రయ్య, సుధాకర్, వెంకట్రాజం, భిక్షపతి తదితరులు ఉన్నారు.

గోవిందరావుపేట: రైతులకు రుణమాఫీ చేయాలని బీఆర్ఎస్ పార్టీ సచివాలయ ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో మండలంలోని బీఆర్ఎస్ నాయకులను పస్రా పోలీసులు గురువారం ముందస్తు అరెస్ట్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు లకావత్ నరసింహ నాయక్, కొలసాని శ్రీనివాస్ రావు, సూడి పద్మా రెడ్డి, రమేశ్, వాగ, సురేష్, శ్రీనివాస్ చారి, వెంకట రాములు, రాజశేకర్, సమ్మయ్యతో పాటు తదితరులు ఉన్నారు.

ఎయిడ్స్ నిర్మూలనకు కృషి చేయాలి

కాళేశ్వరం: ఎయిడ్స్ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఐసీటీసీ కౌన్సెలర్ గాదె రమేశ్ తెలిపారు. హెచ్ఐవీ ఎయిడ్స్ నిర్మూలనకు తీసుకోవలసిన జాగ్రత్తలపై గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు మహాదేవపూర్ సామాజిక ఆరోగ్య కేంద్రంలోని సమీకృత సలహా పరీక్ష కేంద్రం ఆధ్వర్యంలో గాదె రమేశ్ అవగాహన కార్యక్రమం చేపట్టారు. కాళేశ్వరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఎడపల్లిలో ఆరోగ్య సిబ్బందితో కలిసి హెచ్ఐవి, ఎయిడ్స్ నివారణ కోసం ఇంటింటి ప్రచారం నిర్వహించి, కరపత్రాలు పంపిణీ చేశారు. హెచ్ఐవీ సోకకుండా ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే ఇంటింటి తిరిగి జ్వర సర్వే నిర్వహించారు. రక్త నమూనాలను సేకరించి, పరీక్షలు నిర్వహించారు. డ్రైడేను కొనసాగించారు. ఎడపెల్లిలో నిర్వహించిన ఆరోగ్య శిబిరంలో గర్భిణీలకు, బాలింతలకు, ప్రజలకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. హెల్త్ అసిస్టెంట్ అడప రాజారమణయ్య, ఏఎన్ఎమ్‌లు హేమలత, వెంకటమ్మ, ఆశ కార్యకర్తలు రుద్ర, మల్లీశ్వరి పాల్గొన్నారు.

ప్లాట్లలోని చెత్తను తొలగించాలి

ములుగు రూరల్: జిల్లా కేంద్రంలోని శ్రీనివాస కాలనీలోని ఖాళీ ప్లాట్లలో చెత్త చెదారం పేరుకుపోయి కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారని హట్కర్ సమ్మయ్య అన్నారు. ఈ మేరకు గురువారం జిల్లా పంచాయతీ అధికారి దేవరాజ్‌ను కాలనీవాసులతో కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాలనీలో ఖాళీ ప్లాట్లలో నీటి నిల్వలు, చెత్త పేరుకుపోవడంతో దోమలు వృద్ధి చెంది కాలనీ వాసులు అనారోగ్యం బారిన పడుతున్నారని అన్నారు. గ్రామ పంచాయతీ అధికారులకు తెలిపిన పట్టించుకోవడం లేదని అన్నారు. ఉన్నతాధికారులు స్పందించి కాలనీలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని తెలిపారు. కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో వర్షాలు పడిన ప్రతిసారి మురుగు రోడ్లపైకి చేరి నడవలేని పరిస్థితి నెలకొంటుందని అన్నారు. మెరుగైన డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని అన్నారు. కాలనీ వాసులు రాహుల్, కుమార్, తిరుపతి పాల్గొన్నారు.